విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 7, సెప్టెంబరు 2024

వరద ముంపు బాధితులను ఆదుకుంటాం

రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

విశాలాంధ్ర-నంద్యాల : విజయవాడలో బుడమేరు ఉగ్రరూపానికి ముంపునకు గురై తీవ్ర నష్టాన్ని చవిచూసిన బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ భరోసా ఇచ్చారు. వరద బీభత్సంతో నీట మునిగిన అజిత్‌సింగ్ నగర్, దాబ కొట్ల రోడ్డు, ముస్తఫా మస్జిద్ వీధి తదితర ప్రాంతాల్లో మంత్రి ఫరూక్ మోకాటి లోతు నీళ్లలో ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, ఇతర ముఖ్య నాయకులతో కలిసి పర్యటించారు. బాధితులకు మంచినీళ్ల బాటిళ్లు, బిస్కెట్ ప్యాకెట్లు తదితర నిత్యావసరాలను పంపిణీ చేశారు. ముస్తఫా మస్జీదులో పంపింగ్ మోటర్ కాలిపోయిందని, మైక్ ఆడియో ఎక్విప్మెంట్ పూర్తిగా దెబ్బతినిందని, ప్రేయర్ మ్యాట్లు దెబ్బతిన్నాయని మస్జిద్ నిర్వాహకులు మంత్రి ఫరూక్‌కు తెలిపి ఆదుకోవాలని కోరగా మస్జిదుల వారీగా నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని వక్ఫ్ బోర్డు సీఈఓను ఆదేశించారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ భరోసా

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, తాలూకా యువ నాయకులు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిలు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల ప్రకారం విజయ వాడ 45వ డివిజన్ ఏకలవ్యనగర్, భవానిపురంలో పర్య టించి బాధితులకు భూమా శోభ నాగిరెడ్డి ట్రస్ట్ తరపున నిత్యావసర సరుకులు అందజేశారు. సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను వారు పరామర్శించి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. వైకాపా పేటీఎం బ్యాచ్‌తో అసత్యపు ప్రచారాలు చేయిస్తున్నారని మండిపడ్డారు.

'వెంగయ్య స్వీట్స్' విరాళం

విశాలాంధ్ర, ఆత్మకూరు టౌన్ : విజయవాడ వరద బాదితుల సహాయార్థం, ముఖ్యమంత్రి సహాయ నిధికి భారీ విరాళాన్ని పట్టణానికి చెందిన వెంగయ్య స్వీట్స్ షాప్ వారు శుక్రవారం వేల్పనూరు నందు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డిని కలిసి రూ.25,101.00 వేలు విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. వెంగయ్య స్వీట్స్ షాప్ వారిని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అభినందించారు.

విరాళాల సేకరణ

విశాలాంధ్ర - డోన్ : విజయవాడలో వరద బాధితులకు సాయమందించేందుకు (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలోని శుక్రవారం డోన్ పట్టణంలోని వివిధ విద్యా సంస్థలలో చదివే విద్యార్థుల నుంచి విరాళాలను సేకరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్ మాట్లాడుతూ వరదలలో విజయవాడ ప్రాంత ప్రజలకు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం పెద్దఎత్తున జరిగిందనీ, ఇలాంటి సంఘటనలు మరొకసారి జరుగకుండా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరద బాధితుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉండే ఆర్థికవేత్తలు, రాజకీయ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున విరాళాలు ఇచ్చి, వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు శశిధర్ రెడ్డి, రంజిత్ కుమార్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు..

కేబుల్ ఆపరేటర్ల సహాయం

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల కేబుల్ ఆపరేటర్లు నంద్యాల కమ్యూనికేషన్ (సిటీ కేబుల్), ఎమ్ఆర్ కేబుల్ ఆపరేటర్లు వరద బాధితుల కోసం 400 దుప్పట్లను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆధ్వర్యంలో విజయవాడకు పంపారు. ఫిరోజ్ మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్లను అభినందించారు. ప్రతిఒక్కరూ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో..

విశాలాంధ్ర. నందికొట్కూరు .. నందికొట్కూరు పట్టణంలోనీ వాల్మీకినగర్ నుండి శాంతి టాకీస్ పాత బస్టాండ్ కొత్త బస్టాండ్ పోలీస్ స్టేషన్ వరకు విరాళాల సేకరణ చేయడం జరిగిందని రైతు సంఘం జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు తెలిపారు. భారీ వర్షాలకు విజయవాడలోని బుడమేరు కాలనీలో ఒంటిమీద బట్టలు తప్ప సర్వం కోల్పోయారని, 33 మంది చనిపోవ డంతో పాటు దాదాపు 50 వేల మంది శిబిరంలో బాధితు లుగా ఉన్నారన్నారు. ఆహారం నీరు దొరకక ఉండడానికి వసతులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రని ఐదు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని మానవతా దృక్పథంతో ప్రతి ఒక్కరూ బియ్యం బట్టలు ఇతర వస్తువులను వరద బాధితులకు సహాయంగా అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు మహిళ నాయకురాలు. ఎస్ టీబీ. ఎం మల్లేశ్వరమ్మ, నూర్జహాన్, కాటే పోగు సోమన్న, భాస్కర్ గౌడ్, రాజు, మా భాష, మహేష్ పాల్గొన్నారు.

పరిశ్రమలకు రూ.8.43 కోట్ల సబ్సిడీ మంజూరు

- పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి
- కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర -నంద్యాల : జిల్లాలో ఉపాధి అవకాశాలు కల్పించే నూతన పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి పరిశ్రమల అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. జిల్లా పరిశ్రమల మేనేజర్ శ్రీనివాస యాదవ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్ర కుమార్, ఎస్సీ ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోమశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు సృష్టించే పారిశ్రామిక రంగ అభివృద్ధికి సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని, పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి నూతన పరిశ్రమలను నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లా ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలన్నారు. జిల్లాలో 93 పరిశ్రమల యూనిట్లకు 8.43 కోట్ల రూపాయల సబ్సిడీ మొత్తాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. పెండింగులో వున్న 8 యూనిట్లను పరిశీలించి మంజూరు కోసం ప్రతి పాదనలు పంపాలని ఆదేశించారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్, స్టాండ్ అప్ ఇండియా కింద నిర్దేశించిన 66 యూనిట్ల లక్ష్యం మేర యూనిట్ల నెలకొల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

డస్ట్‌బిన్లు పంపిణీ

విశాలాంధ్ర-చాగలమర్రి .. మండలంలోని వివిధ గ్రామాలకు డస్ట్‌బిన్లను ఎంపిడీఓ మహబూబ్ దౌలా, ఈఓఆర్డీ తాహీర్ హుస్సేన్‌లు శుక్రవారం పంచాయతీ కార దర్శులకు పంపిణీ చేశారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా మండలానికి మొదటి విడతగా సుమారు 20 వేల డస్ట్‌బిన్లు వచ్చాయన్నారు. వీటిని మండలంలో ప్రకృతి సంపద కేంద్రాలు గల ముత్యాలపాడు, పెద్దబోధనం, నేలంపాడు, రాంపల్లె, చిన్నబోధనం గ్రామాలకు అందజేశారు. ప్రతి ఇంటికి రెండు డస్ట్‌బిన్లు పంపిణీ చేస్తామని తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా ఉంచాలన్నారు.

మహిళ దారుణ హత్య..

విశాలాంధ్ర, నందికొట్కూరు .. నందికొట్కూరు పట్టణంలోని మారుతి నగర్‌కు చెందిన మహిళ శాలబి (42)ని గురువారం అర్ధరాత్రి దారుణ హత్యకు గురైంది. ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్, నందికొట్కూరు రూరల్ సిఐ సుబ్రహ్మణ్యం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఈ ఘటనలో 8 మంది అనుమానిత నిందితులను అదుపులోకి తీసుకోనీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొందరు యువకులు మద్యం సేవించి దారుణా నికి పాల్పడ్డారనీ ఆరోపణలు వస్తున్నాయి. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

చిన్న రాజు చెరువు గండి పూడ్చివేత

విశాలాంధ్ర రుద్రవరం. మండలంలోని కొండ మాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న చిన్నరాజు చెరువు కు పడిన గండిని పూడ్చివేశారు. కొన్ని రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తుండడంతో చెరువుకు భారీగా నీరు వచ్చి చేరింది. అలాగే తెలుగంగ ప్రధాన కాలువ నుంచి నీటి ప్రవాహం తో చెరువు పూర్తిగా నిండింది. ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన చెరువు కట్ట బలహీనపడి గత కొన్ని రోజుల క్రితం గండిపడింది. గండిని పూడ్చిన కొన్ని రోజులకి మరల తూము సమీపంలో గండి పడింది. దీంతో కొండ మాయపల్లి గ్రామస్తులు రైతులు మైనర్ ఇరిగేషన్ అధికారులకు తెలియజేశారు. టిడిపి నాయకుడు బందారు బాలరాజు, గ్రామ పెద్ద సింగతల మహేంద్ర ఇతర రైతుల సహకారంతో వందలాది బస్తాల మట్టితో గండిపడిన చోట పూడ్చి వేయించారు. దీంతో చెరువు ఎప్పుడు తెగుతుందోనన్న భయం ప్రజల్లో కాస్త ఉపశమనం లభించింది.

జిల్లా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు

- జిల్లా మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర - నంద్యాల : వినాయకునికి పూజలు చేయడం వల్ల విఘ్నతలు తొలగిపోతాయని, వినాయక చవితి పండగను జిల్లా ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బిసి జనార్ధన్ రెడ్డి, కలెక్టర్ రాజకుమారి గణియా, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాలు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎంఎల్సీలు, ఎమ్మెల్యేలు కూడా ప్రజలందరూ గణేష్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. జ్ఞానం, శ్రేయస్సు, అదృష్టానికి స్వరూపుడు వినాయకుడి ఆశీస్సులతో ఎలాంటి అడ్డంకులు లేకుండా జీవనం సాఫీగా జరుగుతుందన్నారు.

పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత



విశాలాంధ్ర-నంద్యాల : నంద్యాల జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని, ప్రతి శుక్రవారం పోలీసుల సమస్యల పరిష్కారం కొరకు పోలీస్ వెల్ఫేర్ డే ను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. శుక్రవారం జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది బదిలీలు, రిక్వెస్టు, మెడికల్ సమస్యలు, సస్పెన్షన్ నుండి విధులకు తదితర సమస్యలను ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారం చూపుతాపనని భరోసా కల్పించారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని కొనసాగించండి

మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి

విశాలాంధ్ర, ప్యాపిలి.. వైసిపి అధికారంలో 3 వేల కోట్లతో డోన్ నియోజకవర్గంను అభివృద్ధి చేశామని ఇందులో భాగంగా 90 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులు పూర్తి చేయాలని మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి అన్నారు. శుక్రవారం వెంగళం పల్లె, కలచట్ల కంబగిరి స్వామి ఆలయం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ డోన్ నియోజకవర్గం ప్రజలు కేవలం వర్షాధారం మీదనే పంటలు పండిస్తారన్నారు. యువకుల కోసం డ్రైవింగ్ స్కూల్, వెటర్నరీ కాలేజీ ఏర్పాటు చేశామని రైతుల కోసం చెరువుల నింపే కార్యక్రమాన్ని చేపట్టామని, ఇవన్నీ పనులు 90 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులు పూర్తి చేయాలని టీడీపీ ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు చల్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, మెట్టువెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, బో రెడ్డి రాము, రాచర్ల దివాకర్ రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం సీపీఐ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల సేకరణ

-సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు

విశాలాంధ్ర-నంద్యాల .. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు విజయవాడలో వరదల వల్ల నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు జిల్లాలో నిత్యావసర వస్తువులు, బట్టలు, నూనె లాంటి సరుకులను, నిధి వసూళ్లు సేకరించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కే. రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు పార్టీ నాయకత్వానికి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నంద్యాల పట్టణంలో బట్టలు, నిత్యావసర వస్తువులు సేకరణలో భాగంగా సూర్య డ్రెస్సెస్ అధినేత ఎన్. రియాజ్‌ఇచ్చిన బట్టలను,గెలివి ఆయిల్ అధినేత రామకృష్ణ ఇచ్చిన ఆయిల్ ప్యాకెట్లను విజయవాడకు పంపనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విరివిగా వస్తువులను సేకరించి పార్టీ కార్యాలయానికి పంపడం ద్వారా వారి నుండి వరద బాధితులకు అందుతాయని, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కే. రామకృష్ణ నాయకత్వంలో పార్టీ ప్రజా సంఘాలు వరదల వల్ల నష్టపోయిన ప్రజలను అనేక విధాలుగా ఆదుకుటుందని వారు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సహకరించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిఎస్. బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న, బేతంచెర్ల మండల కార్యదర్శి వై. భార్గవ్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోస్పాడులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

- సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్

విశాలాంధ్ర - నంద్యాల : గోస్పాడు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలోని అనేక వార్డులలో రోడ్లు, వీధి కాలవలు, కరెంటు స్తంభాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఎంపీడీవో, అధికారులు గ్రామంలో ప్రతి కాలనీ సందర్శించి రోడ్డు నిర్మాణం, వీధి కాలవలు లాంటి మౌలిక వస్తువులు కల్పించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్, మండల కార్యదర్శి. జి హరినాథ్, కార్యదర్శి ఎస్ జిలాని భాష డిమాండ్ చేశారు. గిరిజన కాలనీలో సిపిఐ శాఖ సమావేశం నరసింహ అధ్యక్షతన జరిగింది. గోస్పాడు గ్రామంలో 25 కుటుంబాలతో గిరిజన కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా రోడ్డు, వీధి కాలువలు, వీధిలైట్లు లేక గిరిజన ప్రజలు ఎన్నోసార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా చెవిటి వాడి ముందర శంఖం ఊదినట్టే ఉన్నారని విమర్శించారు. గోస్పాడు గ్రామంలో బీసీ కాలనీ, ఎస్సి కాలనీ లాంటి అనే కాలనీలు ఉన్నాయని, ఏ కాలనీలో చూసినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడ మాదిరిగా ఉన్నాయని, కావున రెవెన్యూ అధికారులు ఆ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మండల కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో శాఖ సభ్యులు షేక్ మౌలా, రమేషు, హాకిమ్ భాష, మంగలి జయరాముడు, దూదేకుల పాపన్న, హుస్సేనమ్మ, బైరి సుబ్బమ్మ, నాసరి కోమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ అజీజ్‌కు "సీమ ఉర్దూ రతన్ అవార్డు"

విశాలాంధ్ర-నంద్యాల : అయ్యలురు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.అబ్దుల్ అజీజ్‌ను రాయల సీమ ఉర్దూ రైటర్స్ ఫెడరేషన్ వారు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని "సీమ ఉర్దూ రతన్ అవార్డు 2024" ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నంద్యాల పట్టణం ముల్లాన్ పేటలోని జోయ ఉర్దూ ఉచిత టేట్ - 2024 కోచింగ్ సెంటర్ నందు విద్యార్థుల సమక్షంలో రాయలసీమ ఉర్దూ రైటర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సత్తార్ ఫైజీ కడప నుండి నంద్యాల వచ్చి అబ్దుల్ అజీజ్ ను "సీమ ఉర్దూ రతన్ అవార్డు" ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సత్తార్ ఫైజీ మాట్లాడుతూ అబ్దుల్ అజీజ్ ఉర్దూ భాష అభివృద్ధికి చేస్తున్న కృషి, ఉర్దూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించటకు, ఉర్దూ పాఠశాలల బలోపేతం చేసేందుకు, ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అవార్డు గ్రహీ మాట్లాడుతూ ఈ అవార్డు పొందడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో జోయ ఉర్దూ కొచింగ్ అసోసియేట్ డైరెక్టర్ సి ఫజ్లుర్ రహమాన్, ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టిచర్స్ అసోసియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు షమీమ్ బాను, ప్రధాన కార్యదర్శి అంజద్ షరీఫ్, జిల్లా ఉపాధ్యక్షులు షబానా పర్వీన్, ఉర్దూ సి.ఆర్.పి నవాజ్ బాష, పెద్ద సంఖ్యలో ఉర్దూ విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : విజయవాడలోని వరద బాధితులకు అండగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియతో పాటు ఆళ్లగడ్డ తాలూకా ప్రజలు చేయూత అందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆళ్ళగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిల ప్రియ భూమా శోభా నాగిరెడ్డి ట్రస్టులి తరపున రూ. 5 లక్షల విరాళం ప్రకటించిన విషయం విధితమే. ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పిలుపు మేరకు ఆళ్ళగడ్డ నియోజకవర్గంలోని 6 మండలాల టీడీపి నాయకులు అందించిన ఎనిమిది లక్షల 50వేల రూపాయలు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రకటించిన ఐదు లక్షల రూపాయలు మొత్తం 13 లక్షల 50 వేల రూపాయల చెక్కును విజయవాడ కలెక్టరేట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి అఖిల ప్రియ ఆళ్ళగడ్డ టీడీపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అందించారు. వరదల్లో చిక్కుకుని తల్లడిల్లిపోతున్న ప్రజలకు మేమున్నాం అంటూ అండగా ఉండి ఆర్థిక సాయం అందించినందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకి, యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు.

వినాయక చవితి ఉత్సవాల్లను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు మరియు నిమజ్జనం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించాలని పట్టణ సీఐ చిరంజీవి అన్నారు. శుక్రవారం స్థానిక అమ్మవారి శాల సమావేశ భవనంలో ఆయన పీస్ కమిటీ సభ్యులు, మండపాల నిర్వహణతో సమావేశమయ్యారు. సీఐ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు శనివారం నుండి ప్రారంభమవుతాయని ఐదు రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాలలో మండపాల వద్ద డీజే సిస్టం ఉపయో గించరాదని భక్తి పాటలు తప్ప ఇతరత్రా ఉండకూడదన్నారు. ప్రతిమలను మద్యం సేవించి అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు.

విశాలాంధ్ర-అవుకు : మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ రెడ్డి, తహసిల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎస్ఐ రాజారెడ్డిలు మండల పరిషత్ కార్యాలయంలో వినాయక నిమజ్జన కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎస్ఐ రాజారెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. మండలంలో అన్ని విగ్రహాలను సోమవారం రోజున అవుకు జలాశయం వద్ద ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జన ప్రదేశంలో నిమజ్జనం చేయాలని అన్నారు. వినాయక మండపాల వద్ద ఎలాంటి అల్లర్లు జరిగిన దానికి వినాయక కమిటీ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు.

ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-నంద్యాల .. జిల్లాలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు ఎస్టియు ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించిన్నట్లు జిల్లా అధ్యక్షులు డి.మౌలాలి తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ నవ సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఈవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. రాష్ట్ర బైలా కమిటీ కన్వీనర్ ఎన్ చంద్రశేఖర్, రాష్ట్ర వెబ్సైట్ కమిటీ కన్వీనర్ జి. నాగేంద్ర కుమార్ లు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై, పెండింగ్ బకాయిలపై చర్చలకు పిలిచి సత్వరమే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, కార్యాలయ ఇంచార్జ్ సుబ్బయ్య,జిల్లా ఉపాధ్యక్షులు జిపి వీరప్ప, మండల బాధ్యులు, సన్మాన గ్రహీతలు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర. నందికొట్కూరు : నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ బేబీ అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఏపీజీ ఈ ఏ నందికొట్కూరు తాలూకా కార్యవర్గం నూతన మున్సిపల్ కమీషనర్ బేబీని అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి నర్సరాజు ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిసి దుస్సాలువ తో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉద్యోగులు సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొని వస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘము అధ్యక్షుడు బాలరాజు కార్యదర్శి నర్సరాజు, సహాధ్యక్షుడు రషీద్, కోశాధికారి రాముడు, ఉపాధ్యక్షురాలు భువనేశ్వరి,సెక్రటరీలు శ్రీనివాసులు, టైపిస్ట్ వెంకటేశ్వర్లు నందికొట్కూరు బీఆర్ఓలు ఆనంద్, శ్రీనివాసులు,బుద్ధకవి, స్వామన్న, ఇరిగేషన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వాడవాడలా కొలువైన గణనాథులు

విశాలాంధ్ర రుద్రవరం : మండలంలోని పలు గ్రామాలలోని వాడవాడలా గణనాథుడిని కొలువు తెచ్చారు. వినాయక చవితి పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లోని యువ కులు చందాలు వేసుకుని వినాయకుని విగ్రహాలను పట్టణాలలో కొనుగోలు చేసి ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు తరలించి ఆయా వాడల్లో కొలువు తీర్చారు. కొందరు యువకులు వినాయకుని విగ్రహాలను మంగళ వాయిద్యాలతో డ్రమ్ముల వాయింపులతో ఊరేగింపుగా తీసుకువెళ్లి మండపాలలో కొలువు తీర్చారు. మండపాలకు రకరకాల విద్యుత్ దీప అలంకరణ చేశారు. దీంతో గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొంది.

సమాజ నిర్మాణంలో గురువు పాత్ర కీలకం

విశాలాంధ్ర-అవుకు: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని వైసిపి ముఖ్య నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి అన్నారు. చల్లా ఆఫీస్ నందు వైసిపి ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్‌రెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న బషీర్ అహ్మద్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డుతో బాధ్యత మరింత పెరుగుతుందని ప్రతి వ్యక్తి జీవితంలో గురువు పాత్ర చాలా కీలకమైంది అని అన్నారు. తల్లి తండ్రి తర్వాత గురువు స్థానం చాలా గొప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హేమీమా, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

విశాలాంధ్ర - నంద్యాల : నంద్యాల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీరామ డిజిటల్ యజమాని,లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చంద్ర మోహన్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, కార్యదర్శి శిరిగిరి రమేష్‌ల నిర్వహణలో శ్రీరామ డిజిటల్ వద్ద ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు మట్టి విగ్రహాలను అందజేశారు. రవికృష్ణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్, ప్లాస్టర్ఆఫ్ ప్యారిస్ వంటి వాటి స్థానంలో మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలన్నారు.నంద్యాల పట్టణం పార్క్ రోడ్డులో గల బాల అకాడమీ, రవీంద్ర విద్యాసంస్థల అధినేత రవీంద్ర, మాధవిలత ఆధ్వర్యంలో స్థానిక ఆత్మకూరు బస్టాండ్ దగ్గర ముఖ్య అతిథి నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ చేతుల మీదుగా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మట్టి విగ్రహాలు వాడి పర్యావరణాన్ని పరిరక్షించు కుందామన్నారు.

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలందరూ మట్టితో తయారుచేసిన వినాయకులనే ప్రతిష్టించి పూజించాలని ఆళ్లగడ్డ మండల తహసిల్దార్ జ్యోతి రత్నకుమారి అన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో మట్టితో తయారుచేసిన గణేష్ విగ్రహాలను రెవెన్యూ సిబ్బందికి పంపిణీ చేశారు

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి-పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు అదుపు చేయడంలో పాలకులు విఫలం చెందారని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు పి. రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యలు విమర్శించారు. సీపీఐ కేంద్ర కమిటి పిలుపులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు సీపీఐ జిల్లా పరిషత్ నుండి కలెక్టరేట్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈధర్నా కార్యక్రమానికి సీపీఐ నగర కార్యదర్శి పీ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఈధర్నా నుద్దేశించి రామచంద్రయ్య మాట్లాడుతూ 2014లో ఎన్నికల సమయంలో ప్రదాని మోడీ తాము అధికారంలోకొస్తే 100 రోజుల్లో ధరలు అదుపు చేస్తామని చెప్పి ఇప్పటికి పదేళ్లు అయినా ధరలు అదుపు చేయకపోగా పెరిగిన ధరల కారణంగా పేదవాడు మూడుపూటల కడుపు నిండా తినే పరిస్థితి లేకండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజిల్ ,పెట్రోల్ ధరలు అదుపు చేయడంలో పూర్తి విఫలం చెందారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కె.జగన్నాథం, నభిరసూల్, ఏఐటీయూసీ నగర అధ్యక్షకార్యదర్శులు వెంకటేష్, చంద్రశేఖర్, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీ మహిళా సమాఖ్య నగర అధ్యక్షకార్యదర్శులు నాగేంద్రమ్మ,భారతి, సీపీఐ నగర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, బీసన్న, సీపీఐ ఓర్వకల్లు మండల కార్యదర్శి ఆవుల రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, శరత్, సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, నల్లన్న, అన్వర్‌బాష, కుమార్, శైలజా, రఖియా, సులోచనమ్మ, పావని, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ నిర్మాణం తలపెడితే దిగ్బంధనం చేస్తాం-రైతు సంఘాలు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ఓర్వకల్లు మండల పరిధిలోని ఉయ్యాలవాడలో సోలార్ పరిశ్రమ వద్దే వద్దు అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టర్ మరియు తహశీల్దార్ కార్యాలయం ముందు రైతులు గ్రామస్తుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమానికి ఏపీ రైతు సంఘాలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య,ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి,ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ, జిల్లా కార్యదర్శి జగన్నాథం, ఏపీ వ్యవసాయ కార్మిక సం ఘం జిల్లా సహాయ కార్యదర్శి బి. నాగన్న రైతు సంఘం నాయకులు రమేష్ మధుసూదన్ పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడుతా మని గత క్యాబినెట్ తీర్మానం చేయడంతో రైతులు తీవ్ర ఆందోళన చెంది వివిధ రూపాలలో రైతులు ఆందోళన చేశారని మొత్తం గ్రామ మంతా ముక్తకంఠంతో గ్రామపంచాయతీ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపారన్నారు .అంతటితో ఎలక్షన్ కోడ్ రావడంతో ఆందోళన ఆగిందని ప్రతిపక్షంలో ఉండే తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామానికి వచ్చిన సందర్భంగా మా గ్రామంలో సోలార్ పరిశ్రమ మాకు వద్దం టూ వినతులు కూడా ఇచ్చారన్నారు. ఆసందర్భంగా మేము అధి కారంలోకి వస్తే సోలార్ ప్లాంట్‌ను రానివ్వ కుండా అడ్డు కుంటామని హామీఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం మళ్లీ ఈ మధ్యకాలంలోనే మళ్లీ అధికారులు ఊర్లో సర్వే చేయడం కోసం రావడంతో రైతులు ప్రజలు తీవ్రమైన ఆందోళన చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచన చేసి ఆ ప్రాంతంలో ఉన్న రైతులతో గ్రామసభ జరిపి రైతుల ఆమోదం లేకుండా భూములను తీసుకోవద్దని డిమాండ్ చేశారు . సోలార్ ప్లాంట్ తో ఉన్న భూములు తీసుకుంటే అక్కడ పశువులకు, గొర్లకు మేత లేక ఇబ్బందులకు గురవుతారన్నారు.దీంతో ఊరంతా ఖాళీ చేసి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.కాబట్టి రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్నటు వంటి కూటమి ప్రభుత్వం పునరా ఆలోచన చేసి క్యాబినెట్ తీర్మానాన్ని వెనక్కి తీసుకొని సోలార్ ప్లాంటును రద్దుచేసి రైతుల పొలాలను మరియు పశువులు గొర్ల కాపర్ల జీవనాన్ని దెబ్బతీయవద్దని వంట పొలాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మహబూబ్ బాషా, రామకృష్ణ, సుబ్బరాయుడు, హుస్సేన్, వెంకటరమణ, తిరుపతయ్య, శ్రీరాములు, వేణుగోపాల్, బ్రహ్మాచారి, సరస్వతి, మధు, ఏపీ రైతుసంఘం నాయకులు డి.శ్రీనివాసరావు వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లను వేయాలి-సీపీఐ

విశాలాంధ్ర-పెద్దకడబూరు: భారీవర్షాలతో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పలుగ్రామాల్లో వర్షాలు కారణంగా రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయన్నారు. డ్రైనేజీల పూడికతో పెరుకు పోయాయన్నారు. శుభ్రం చేయించాలని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అధికారులు సీటుకే పరిమితం కాకుండా గ్రామాల్లో నెలకొన్న పరిష్కరించాలన్నారు. ఏఐవైఎఫ్ తాలూకా అధ్యక్షులు జాఫర్ పటేల్, తిక్కన్న,హనుమంతు,సుభాన్, రామాంజనేయులు,గిడ్డయ్యలు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలి-సీపీఐ

విశాలాంధ్ర-ఆలూరు : రాష్ట్రంలో నిత్యావసర సరుకుల ధరలు మండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే నిత్యవసర ధరలు తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి రామాంజినేయులు, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చాపల గోపాల్,భారత కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం దగ్గర సీపీఐ నాయకులు,కార్యకర్తలు నిత్యావసర వస్తువుల ధరలని తగ్గించాలని, కొత్త బియ్యం కార్డులు మంజూరు చేయాలని కోరుతూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతూన్నాయని, పేదప్రజలు పెరిగిన ధరలకు నిత్యావసర వస్తువులను కొనలేక ఆకలి చావులకు బలివతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజవర్గ కార్యదర్శి శివ, అమాలి సంఘం నాయకులు, రైతు సంఘం నాయకులు, సీపీఐ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ఆధ్వర్యంలో ఇటీవల పదవి విరమణ చెందిన ఉపాధ్యాయులకు శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఘనంగా సన్మానించారు. సర్వేపల్లి చిత్రపటానికి ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మరియు ఎస్టీయూ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ని ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని విద్యాభివృద్ధి కొరకు పాటుపడాలని కోరారు. కులుసు మాభి, పి.శాంతమూర్తి, హెచ్.వెంకటేశ్వర్లు, కే.బాలరాజు,ఎం.మంజులను ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది విద్యాభివృద్ధికి కృషి చేసిన వారి సేవలను కొనియాడుతూ ఎస్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎస్టీయూ సీనియర్ నాయకులు మోజెస్, నాగరాజు, బసవరాజు బాబయ్య, ఎల్లప్ప, అడివన్న, వెంకట్రాముడు, చంద్రశేఖర్, సిద్ధలింగమూర్తి, నాగభూషణం, తిమ్మరాజు, వి.నాగరాజు, రామచంద్ర, చిన్నతిమ్మన్న, సురేష్, శేఖర్, ఏసేపు, శంకర్, రాముడు, భాస్కర్, వీరేష్, తులసీరామ్, లక్ష్మణ్, చంద్రశేఖర్, సంజీవ రాయుడు, దర్గయ్య, రామలింగమ్మ, గాయత్రి, ప్రమీల, రజియ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ఆదోని రూరల్: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శుక్రవారం ఆదోని, కౌతాళం మండలాల ఎస్టీయు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి

పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రధానోపాధ్యాయులు సత్యాన్న, జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న,ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు హాజరై ప్రసంగించారు. సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తిలో మనముంటున్నందుకు గర్వపడుతూ మనం మరింత నీతిగా, నిజాయితీగా, సమర్థవంతంగా పనిచేస్తూ మన వృత్తికి మరింత గౌరవం తెచ్చే విధంగా ఉండాలని పెర్కొన్నారు. నేటి సమాజంలో ఉపాధ్యాయుల యొక్క పాత్రను తగ్గిస్తూ వస్తున్న అనేక రకాల సాంకేతికతలు వివిధ పద్ధతుల్లో వచ్చినప్పటికీ ఉపాధ్యాయునికి ఏది సరితూగదని అందరికీ అర్థమైందని తెలియజేశారు. ఇతర సాంకేతికతలు విద్యార్థులకు విషయాన్ని అందివ్వగలవేమో గాని విలువలు కూడా కావాలని, కచ్చితంగా ఉపాధ్యాయుల పాత్ర ఉండాల్సిందీ నన్నారు. సమాజంలో ప్రస్తుతం ఉపాధ్యాయులకు ఉండే గౌరవం మరియు కష్టాలు ఇలాంటివన్నీ పట్టించుకోకుండా ఒక రైతు ఎలా అయితే తన వృత్తిని ప్రేమించి సమాజానికి అన్నం పెడతాడొ అలాగే మనం కూడా బడి అనే భూమిలో విద్య అనే విత్తనం వేసి అక్షరం అనే నీరు పోసి అజ్ఞానం అనే కలుపు తీసి జ్ఞానం అనే పంటలు పండించి సమాజానికి అందివ్వడంలో ఉపాధ్యాయులు చేయాల్సిన కృషి దాగి ఉందన్నారు. మన వంతు కృషిని సక్రమంగా నిర్వర్తిద్దామని తెలిపారు. కార్యక్రమంలో ఆదోని మండల అధ్యక్షులు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు, ఎస్టియు సీనియర్ నాయకులు సూర్యుడు, రాము, నాగభూషణం, యువ కార్యకర్తలు అంజి, రామాంజనేయులు ఆర్బి వెంకటేశ్వర్లు, భాస్కర్,లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు



విశాలాంధ్ర-హొళగుంద: మండల కేంద్రమైన హొళగుందలో 9న జరిగే గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని గ్రామ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. ఎల్లెల్సీ దిగువ కాలువ ఇరువైపులా బారికేడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు, పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటామని భక్తులకు తాగునీరు, భక్తులు దిగువ కాలువలో దిగకుండా ప్రమాదాలు జరగకుండా లౌడ్ స్పీకర్ ద్వారా సిబ్బందితో హెచ్చరిస్తామన్నారు. గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా ప్రశాంత్ జరగడానికి అందరూసహకరిచాలని కోరారు. ఎల్లెల్సీ కాలువను శుక్రవారం గ్రామ కార్యదర్శి రాజశేఖర్‌గౌడ్ పరిశీలించారు.

వరద బాధితులను పార్టీలకు అతీతంగా ఆదుకోవాలి-సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: గుంటూరు,విజయవాడ జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా వరదలతో చిన్నా బిన్నమైన ఆ ప్రాంతాల ప్రజలను ఆదుకోవడానికిప్రతిఒక్కరూ మానవ దృక్పథంతో సహాయ సహకారాలు అందించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య తెలిపారు. అనంతరం శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలో మిత్రులు, శ్రేయోభిలాషుల, సహకారంతో రూ.30 వేల మెటీరియల్‌ను సీపీఐ ఆధ్వర్యంలో విజయవాడలోని వరద బాధితులకు పంపించడం జరిగిందని వారు తెలిపారు. వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకొచ్చి ఆర్థికంగానూ, నిత్యవసర సరుకులు,వస్తు రూపంలో ఆ ప్రాంతాలకు పంపించి వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి శ్రీనివాసులు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రంగన్న, పంపన గౌడ్, భాస్కర్ యాదవ్, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల్లా, విద్యుత్ మీటర్ రీడర్స్ (ఏఐటీ యూసీ) జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, మరియు ఉరుకుందు,రాజు, శేఖర్,వీరేష్, నరసప్ప,కిరణ్, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర, ఏఐటీయూసీ నాయకులు మల్లికార్జున్‌గౌడ్, వీరేష్, రామాంజనేయులు, శ్రీరామ్,ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎం.ఎం.డి.గౌస్,రంగన్న తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

కోడుమూరు: విజయవాడ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాలలోని వరదలలో చిక్కుకున్న బాధితులకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు గూడూరులో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, సీపీఐ కోడుమూరు మండల కార్యదర్శి బి.రాజు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సోమమోహన్,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీరాములు గౌడ్, గూడూరు సీపీఐ మండల కార్యదర్శి బీడీల శ్రీనివాసులు ఆధ్వర్యంలో షాపుల యజమానులు, చిరువ్యాపారస్తుల దగ్గరకు వెళ్లి విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద బాధితులకు ఆర్థిక సహాయం అందించినటువంటి దాతలకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగస్వామి,గూడూరు సీపీఐ, ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు లక్ష్మన్న, శివ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు

ఎస్సీ రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ

విశాలాంధ్ర-పెద్దకడబూరు: మండల పరిధిలోని హెచ్ మురవణిలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ హైదరాబాద్ వారి సహకారంతో 330 మంది ఎస్సీ రైతులకు టార్పలీన్లు, టార్చ్ లైట్, వంటి వ్యవసాయ పనిముట్లను మంత్రాలయం నియోజక వర్గ టీడీపీ ఇంచార్జీ రాఘవేంద్ర రెడ్డి,టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, మండల కన్వీనర్ బసలదొడ్డి ఈరన్న చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ రైతులకు వ్యవసాయ పనిముట్లను అందించడం శుభ పరిణామ మన్నారు. రైతులు వ్యవసాయంలో శాస్త్రవేత్తల, అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. మంత్రాలయంనియోజకవర్గం అత్యంత వెనుక బడిన ప్రాంతమని ఎస్సీ రైతులు మరింత వెనుకబడ్డారన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. రమాకాంతరెడ్డి, ఈరన్న మాట్లాడుతూ మంత్రాలయం నియోజక వర్గం రైతులు ఎల్లప్పుడూ కరువు కాటకాలతో ఇబ్బందులు పడుతున్నారని, కరువు నివారణకు శాస్త్రవేత్తలు తక్కువ నీటితో పండించే వంట రకాల విత్తనాలు ఉచితంగా ఇవ్వ దం, డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహించే విధంగా 100 శాతం సబ్సిడీ ఇవ్వడం, డ్రోన్లు పంపిణీ చేయడం వంటివి చేపడితే రైతుల స్థితి గతులు మెరు గుపడతాయన్నారు. ముమ్మందు ఇ లాంటి పథకాలు రైతులకు అందేలా చూడాలని కోరారు. అనంతరం రైతు లకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సబ్ ప్లాన్ చైర్మన్ డా.బాలకృష్ణన్, శాస్త్రవేత్త డా. రమేష్ నాయక్, టెక్నికల్ అధికారి డా.లక్ష్మణ్, శేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఏసేపు, మల్లికార్జున, హనుమంతరెడ్డి, విజయ్ కుమార్, నరసన్న, సత్యన్నగౌడ్, సురేష్, మాలింగప్ప, వీరేష్‌గౌడ్, రంగన్న, సొంటెన్న, అంజినయ్య,జనార్దన్, నర్సయ్య, మునెప్ప అధిక సంఖ్యలో రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేయి..చేయి కలుపుదాం..వరద బాధితులకు చేయుతనిద్దాం..!

విశాలాంధ్ర-హొళగుంద: చిన్నహ్యాటలో శుక్రవారం విరాళాల సేకరణ కార్యక్రమం గ్రామ పెద్దలు గ్రామ యువకులు ఆధ్వర్యంలో చేపట్టారు. గ్రామ వీధుల్లో గ్రామస్తుల నుండి నగదు, బియ్యం విరాళాల సేకరణ చేశారుయువకులు ఐక్యంగా కులమత రాజకీయ యువజన సంఘాలకు అతీతంగా కుటుంబ సభ్యులుగా వరద బాధితులకు సహాయంగా నగదు,బియ్యం విరాళంగా అందించి మానవత్వాన్ని చాటారు. సర్పంచు డీఎస్ హేశానుల్ల మాట్లాడుతూ కదలి రండి కలిసి రండి ఇసుక రేణువుల్లా ఏకమౌదం సాటి మానవుడికి సహాయపడడమే సర్వధర్మల సారాం ఒక్కటేనన్నారు. ఈనగదు బియ్యం విరాళాల సేకరణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువత కులమత రాజకీయ పార్టీలకు అతీతంగా యువకులు, కురవ బసవ, ప్రకాశ, మంజు, మాజ్, తదితరుల పాల్గోన్నారుహొలగుంద ఈబిసి కాలనీ, హెబ్బతంలో విరాళాల సేకరణ చేశారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-తుగ్గలి: గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో అధిక వర్షాలతో ప్రజలు అతలాకుతలమవుతున్న సంగతి అందరికీ తెలిసినదే. అయితే ప్రధానంగా విజయవాడ నగరం ఒక జలాశయాన్ని తలపించే విధంగా నీట మునగడం అందులోని ప్రజలు పూర్తిగా ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో విజయవాడకు విరాళాలు వెలువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే మండల పరిధిలోని శభాష్ పురం పంచాయతీ టీడీపీ నాయకులు ఈడిగ సుధాకర్ గౌడ్,ఈడిగ హనుమంతుగౌడ్, ఈడిగ హుస్సేన్‌గౌడు, శభాష్‌పురం మోహన్, ఆదినారాయణ, తలారి శ్రీరాములు విజయవాడలోని వరద బాధితులకు రూ.30 వేల ఆర్థిక సహాయాన్ని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాలివాహన ఫెడరేషన్ చైర్మన్ మండల టీడీపీ నాయకుడు అయిన తుగ్గలి నాగేంద్రకు అందజేశారు. అనంతరం తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో విజయవాడ లో అకాల వర్షాల వల్ల వరదలు చిన్నపాటి సముద్రాన్ని తలపించేలా ఉన్నందున అందులో నివసించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇందు కోసం మండల వ్యాప్తంగా విరాళాల సేకరణకు పిలుపు ఇవ్వడంతో స్పందించిన కొందరు విరాళాల రూపంతో అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే మండల వ్యాప్తంగా విరాళాలు ఇవ్వడానికి ఇంకా దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

వరద బాధితుల సహాయార్థం సీపీఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

విశాలాంధ్ర-దేవనకొండ రూరల్: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు కారణంగా విజయవాడ నగరంలో సంభవించిన వరద విపత్తుల కారణంగా నష్టపోయిన ప్రజలకు ఆర్థిక చేయూతకోసం మండల కేంద్రమైన దేవనకొండలో విరాళాలు సేకరించి సీఎం సహాయనిధికి పంపనున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి ఎమ్.నరసరావు, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.మధు,కె.భాస్కర్ లు తెలిపారు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ - ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో దేవనకొండలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదల కారణంగా విజయవాడ గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాలో పెద్ద ఎత్తున వరదలు వచ్చి లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర ప్రజలు ధాన్యం వస్తువులు సర్వస్వం కోల్పోయారని తెలిపారు. వేలకోట్ల లో ఆస్తి,పంట నష్టం జరిగిందన్నారు. ఇలాంటి విపత్తు సమయంలో వరద బాధితుల ను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి,వారి సహాయార్థం విరాళాలు,వస్తురూపేనా, బట్టలు, తదితరాలు వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వ సహాయ నిధి కి పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శిలు వి. రాజశేఖర్ , కృష్ణ ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రామాంజనేయులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు రాజశేఖర్, కృష్ణ, శేఖర్, సురేంద్ర, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఎమ్మిగనూరే మా లక్ష్యం

ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే బీవీ

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు టౌన్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎమ్మిగనూరు బస్టాండ్‌లో ఎమ్మెల్యే డా. బీవీ.జయనాగేశ్వర్‌రెడ్డి మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ ఎమ్మిగనూరు బస్టాండ్‌ను ఆధునీకరించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చి ఎమ్మిగనూరు ఆర్టీసీ బస్టాండ్ ను జిల్లాలోనే నంబర్ వన్ బస్టాండ్‌గా మారుస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మానవళి మనుగడకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ అమర్నాథ్, టీపీవో గోపాల కృష్ణ, టీడీపీ నాయకులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

విశాలాంధ్ర-కర్నూలు: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం,ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖా మంత్రివర్యులు టీ.జీ.భరత్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషలు జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని కృపతో జిల్లా ప్రజలంతా సంతోషంగా ఉండాలని, వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని, చేపట్టే ప్రతిపనిలో విజయం చేకూరాలని మంత్రి, కలెక్టర్ ఆకాంక్షించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని,మట్టి వినాయకుని విగ్రహాలతో పూజలు జరుపుకుని, సంతోషంతో పండుగ చేసుకోవాలని మంత్రి, కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నిత్యవసర సరకు ధరలు తగ్గించాలి

విశాలాంధ్ర-మంత్రాలయం: పెంచిన నిత్యవసర సరుకులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రవికి అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి.విజయభాస్కర్ యాదవ్ మాట్లాడుతూ పెంచిన నిత్యవర సరకులు ధరల తగ్గింపు, పెట్రో, డీజిల్ రేట్లు తగ్గించాలన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న చెరువులను నింపి రైతులకు సాగునీరు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు లక్ష్మణ్ణాయకు గబ్రేలు హనుమంతు అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం-వీరభద్ర గౌడ్

విశాలాంధ్ర-ఆస్పరి : రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఆలూరు టిడిపి ఇన్చార్జి వీరభద్ర గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బిల్లేకల్లులో దినసరి టమోటా, కూరగాయల మార్కెట్‌ను వీరభద్ర గౌడ్ ప్రారంభించారు. ఈసందర్భంగా రైతులతో ముఖాముఖి మాట్లాడారు. కూరగాయల మార్కెట్ నూతన చైర్మన్ వీరేష్ ఆధ్వర్యంలో మార్కెట్ ప్రారంభోత్సవం చేపట్టారు. వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ చంద్రన్న రాజ్యంలో రైతును రాజుగా చూడాలనే గొప్ప లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడన్నారు. కూరగాయల మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారస్తులు మార్కెటింగ్ చేయాలన్నారు. రైతుల సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్, నాయకులు మహేష్, కృష్ణారెడ్డి, హరి, భీముడు, ఈరన్నగౌడ్, లక్ష్మన్న, ఎమ్మార్, రఘురాముడు గ్రామ పెద్దలు అటేకలు ఈరన్న, వ్యాపారస్తులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులను పూజిద్దాం

విశాలాంధ్ర- కర్నూలు సిటీ : పర్యావరణ హితం కోసం మట్టి గణపతులను పూజించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి చెప్పారు. శుక్ర వారం స్థానిక శ్రీశ్రీశ్రీ లక్ష్మి నరసింహ స్వామి వినాయక భక్త బృందం చే పెద్ద మార్కెట్ వద్ద ప్రతిష్ఠ చేస్తున్న 63 అడుగుల భారీ మట్టి విగ్రహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పర్యావరణ రహిత భారీ విగ్రహమును కర్నూలులో ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమని తెలిపారు. ఈ విగ్రహం పర్యావరణ సమతుల్యతను నెలకొల్పుతోందని, కర్నూలు నగరంలో 11రోజులు ఈవిఘ్న వినాయకుడు పూజలు అందుకుంటారని, కర్నూలు ప్రజలు అవకాశాన్ని ఉపయోగించుకుని మట్టి గణపతికి పూజలు చేసి తమ కోర్కెలు నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎంతో కష్టసాధ్యమైన ఈదైవకార్యక్రమంలో తాను భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం...!

విశాలాంధ్ర-పత్తికొండ: వరద బాధితులకు అండగా నిలుద్దామని తెలుగు దేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు శుక్రవారం తెలుగుదేశం పార్టీ నాయకులు పత్తికొండలో విరాళాలు సేకరించారు. పట్టణ ప్రజల నుండి అందిన విరాళాలు రూ.91,500లు, పందికోన తెలుగుదేశం నాయకులు 1 (ఒక) లక్ష రూపాయలు, నలకదొడ్డి తెలుగుదేశం నాయకులు రూ.50 వేల రూపాయలు విరాళం అందించడం జరిగింది. సేకరించిన విరాళాల మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నలకదొడ్డి మాజీ సర్పంచ్ బత్తిన లోకనాథ్, తెలుగుదేశం పార్టీ నాయకులు రామానాయుడు, కడవల సుధాకర్, ఖాసీం, మనోహర్ చౌదరి, శ్రీధర్ రెడ్డి, వెంకటపతి, దస్తగిరి రెడ్డి, ఈశ్వరప్ప, తిప్పన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు విజయవంతంగా చేపట్టండి-సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

విశాలాంధ్ర-ఆదోని: గణేష్ ఉత్సవాలను విజయవంతంగా చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం వినాయకఘాటు వద్ద నిర్వహించిన గణేష్ఉత్సవ కమిటీ సభ్యులతో, డివిజన్‌స్థాయి సంబంధిత అధికారులతో కలిసి గణేష్ ఉత్సవాల నిర్వాణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 7న జరిగే వినాయక చవితి పండుగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఆదోని పట్టణంలో 11న జరిగే నిమజ్జనం కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. గణేష్ ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా మౌలిక సదుపాయాలు తాగునీరు, విద్యుత్, లైటింగ్, శానిటేషన్, ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిమజ్జనం వెళ్లే రోడ్డులో ఏదైనా గుంతలు ఉంటే వాటిని గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. ప్రజలకు విద్యుత్ అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జనం దగ్గర గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో క్రేన్లు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమేరకు క్రేన్ సంబంధించిన టెక్నికల్ వారిని కూడా నియమించు కోవాలని ఆర్టీవో అధికారులకు ఆదేశించారు. గజ ఈతగాళ్లు ఏర్పాటు చేయాలని ఫిషరీస్ అధికారులకు ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయంతో గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు. 11వ తేదీన జరగనున్న నిమజ్జనంకు పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని డిఎస్పీకు ఆదేశించారు. పట్టణంలోని ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు పని చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశించారు. అంతకుముందు సబ్ కలెక్టర్ నిమజ్జనం చేసే కాలువ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశించారు. డీఎస్పీ సోమన్న ట్రైనీ డీఎస్పీ ధీరజ్, తహసీల్దార్ శివరాముడు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎల్పివో నూర్జహన్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సిసిరదీప్తి, డిప్యూటీ డిఎం హెచ్‌వో సత్యవతి పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 07, సెప్టెంబర్ 2024

విద్యుత్ కొరత లేకుండా చూడాలి

విశాలాంధ్ర-హొళగుంద: మండల కేంద్రమైన హొళగుందలో శుక్ర వారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అబ్దుల్ సుభాన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఏఈ కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ వర్షాకాలంలో డ్యాములు వరదనీటితో నిండిపోయి గేట్లు ఎత్తిన ఇక్కడ మాత్రం విద్యుత్ కొరత తీయడం లేదని ఆవేదన చెందారు ఏ చిన్న పార్టీ విద్యుత్ సమస్య ఏర్పడితే చాలు దాదాపు 4 గంటల వరకు గ్రామంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోతుందని దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. విద్యుత్ సిబ్బంది ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విద్యుత్ కోత విధించడం వల్ల విద్యుత్ సరఫరా సక్రమంగా జరగడం లేదని వాపోయారు అసలే వర్షాకాలం అని దోమల బెడద ఎక్కువ ఉన్నదని విద్యుత్ కొరత వల్ల ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారని దోమల బెడద నుండి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని అన్నారు. రోజు విద్యుత్ కోతల వల్ల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. విద్యుత్ సక్రమంగా సరఫరా చేయాలంటూ లైన్మెన్ మనప్పాచారికి వినతి పత్రాలు సమర్పించారు. విద్యుత్ కొరతను తీర్చకపోతే విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు ప్రజలతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో టిడిపి నాయకులు బిఎం హేసానుల్లా, ముల్లా మోయిన్, జుమ్మా సలీం, కేసుభాన్, జంగాల రామాంజిని, జఫరుల్లా, ఫారు క్, రవి, నాగరాజా, రాజా, ముల్లా బుడ్డమండల జనసేన పార్టీ కన్వీనర్ అశోక్, జనసేన పార్టీ నాయకుడు వరాల వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 15వ తేది నాటికి పూర్తి చేయాలి-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: బి. తాండ్రపాడు- గార్గేయపురం వరకు జరుగుతున్న రింగ్ రోడ్డు పనులను నవంబర్ 15 వ తేది నాటికి పూర్తి చేయాలని ఎన్ హెచ్ 340సి పిడి ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టు ల పై నేషనల్ హైవే అధికారులతో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ హెచ్ 340 బి కి సంబంధించి సోమయాజులపల్లె నుండి డోన్ రూట్ కి సంబంధించిన భూసేకరణ పనులు త్వరితగతిన చేయాలని కర్నూలు ఆర్డీఓ ను కలెక్టర్ ఆదేశించారు. ఎన్ హెచ్ 167 కి సంబంధించి ఆదోని బైపాస్ కొరకు భూసేకరణ పనులు త్వరితగతిన చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ ట్రైని కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇన్చార్జి డిఆర్ఓ చిరంజీవి, కర్నూలు ఆర్డీఓ శేషి రెడ్డి , ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర, ఎన్ హెచ్ 340సి పిడి పద్మ, ఎన్ హెచ్ 40 పిడి అశోక్ కుమార్, ఎన్ హెచ్ 150సి పిడి తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాటకు కట్టుబడి ఉన్నాం-జనసేన నాయకులు

విశాలాంధ్ర-కౌతాళం రూరల్ : మేము అన్న ప్రతి మాటకు కట్టబడి ఉన్నామని మంత్రాలయంజనసేన నాయకులు హనుమేష్ ఏసోబు, రామాంజనేయులు, మహమ్మద్, రాజు, సత్య, వీరేష్, రాంబాబు, సాయి బన్న, మారెప్ప అన్నారు. శుక్రవారం ఉదయం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గం నాయకుడు లక్ష్మన్న జనసైకుల మధ్య చిచ్చుపెడుతూ వర్గాలు ఏర్పాటుచేసి రాజకీయం చేస్తున్నాడని విమర్శించారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున పోటీ చేసి ప్రచారంలో జనసేన కార్యకర్తలకు నాయకులకు కనీస భోజన వసతి కల్పించని నాయకుడని బాధను వ్యక్తం చేశారు. జనసేన సైనికుల మీద నిందలు వేసి వైసీపీ వారికి అమ్ముడుపోయినది మీరే కదా అని నిలదీశారు. లక్ష్మన్న ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులతో సమావేశమైన, తన స్వార్థం కోసం పార్టీని తాకట్టు పెట్టిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. మేము సాక్షాధారాలతో సహా అన్ని ఆధారాలు పార్టీ అధ్యక్షునికి అందజేశామని, దమ్ముంటే మీరు మీ దగ్గరున్న ఆధారాలు అందజేయాలని సూచించారు. సమా వేశంలో కౌతాళం, మంత్రాలయం, కోస్గి, పెద్దకడబూరు మండలాల నుంచి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మోక్షజ్ఞ తేజ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-నందికొట్కూరు: స్థానిక పాత బస్టాండు ఆవరణలో బాలకృష్ణ కార్యాలయంలో యువసింహం నందమూరి మోక్షజ్ఞతేజ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నందికొట్కూరు నందమూరి బాలకృష్ణ అభిమానులు, తాలూకా అధ్యక్షులు, తిమ్మరెడ్డి, టౌన్ అధ్యక్షులు మసుంభాష, సెక్రెటరీ కిషోర్, తాలూకా సెక్రెటరీ బండారు శ్రీను, ట్రెజరీ శివ, మద్దిలేటి బాలయ్య అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం హాస్పిటల్ లో బ్రెడ్స్, పండ్లు పంపిణీ చేశారు.

10న పారామెడికల్ కోర్సులకు మలి విడత కౌన్సిలింగ్

విశాలాంధ్ర-కర్నూలు వైద్యం: పారామెడికల్ కోర్సులలో చేరటానికి విద్యార్థులకి రెండో విడత కౌన్సెలింగ్ ఈనెల 10వ తేదీన మెడికల్ కాలేజీలోని ఆడిటోరియం నందు ఉదయం 10 గం.లకు నిర్వహిస్తున్నట్లు అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ కర్నూల్ మెడికల్ కాలేజ్ డాక్టర్ కే. చిట్టి నరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి విడత కౌన్సిలింగ్ లో వివిధ కోర్సుల్లో మిగిలిన సీట్లు డిప్లమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్-14, డిఏఎన్ ఎస్-5, డిఎంఐటి 4, డి ఆర్ జి ఎ-3, డి ఓ ఏ-2,%ణ%.డయాలిసిస్-6,. డార్క్ రూం అసిస్టెంట్-6, ఈ సి జి - 3, కేత ల్యాబ్-3, డిప్లమా ఇన్ కార్డియాలజీ టెక్నీషియన్-3 సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని ,అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లుతో హాజరు కావాలని మిగిలిన సీట్లను మెరిట్ మరియు రోస్టర్ ఆధారంగా భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు.

ఫిజియోథెరపీ తప్పనిసరి చేయాలిఫిజియో వైద్యులు జమిల్‌షాలి

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: మానసిక దివ్యాంగులైన పిల్లలకు ఫిజియోథెరపీ తప్పనిసరి చేయాలి ఫిజియో వైద్యులు జమిల్ షాలి పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక భవిత కేంద్రంలో మానసిక దివ్యాంగులకు పట్టణానికి చెందిన షాలి ఫిజియోథెరపీ హాస్పిటల్ ఆధ్వర్యంలో డా.జమీల్ షాలి ఉచితంగా ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కో-ఆపరేటివ్ స్టోర్స్ మాజీ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, రిటైర్డ్ తహసీల్దార్ అల్లా బకాష్ లు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దివ్యాంగులైన పిల్లల అభివృద్ధి కోసం సమాజంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని, క్రమం తప్పని ఫిజియోథెరపీ దివ్యాంగులకు వరమనీ అన్నారు. శారీరక మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు వైద్యుల సలహాలను పాటించాలని అన్నారు. కొంతమంది విద్యార్థులకు ఫిజియోథెరపీ ద్వారా మెరుగుపడే అవకాశాలు ఎక్కువ ఉన్నాయన్నారు. తల్లిదండ్రుల అవిద్య, అవగాహన లోపమే వారి స్థితికి కారణమనీ, చిన్న వయసులో పెళ్ళిళ్ళు అనారోగ్య హేతువని తల్లిదండ్రులను హెచ్చరించారు. సమాజం బాల్య వివాహాల పట్ల అవగాహన కలిగి ఉండాలనీ తద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని చూడవచ్చని అన్నారు. షాలి ఫిజియోథెరపీ వైద్యాశాల ఆధ్వర్యంలో మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఫిజియో వైద్యులు షరీఫా, శివరాజ్, ముంతాజ్, మేఘన, రఫిక్, భవిత పాఠశాల ఉపాధ్యాయులు బాల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

29 లోగా డ్రాఫ్ట్ ఎలెక్ట్రోల్ రోల్‌ను తయారు చేసుకోవాలి

విశాలాంధ్ర-ఆదోని : స్పెషల్ సమ్మరీ రివిజన్ కు సంబంధించి అక్టోబరు 29వ తేది నాటికి డ్రాఫ్ట్ ఎలెక్ట్రోల్ రోల్‌ను తయారు చేసుకోవాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బిఎల్ఓ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు బిఎల్ఓలు ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ చేయడం జరుగుతుందన్నారు. అక్టోబర్ 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిర్వహించి, అక్టోబర్ 29వ తేదీన సంక్షిప్త ముసాయిదా ఓటర్ల జాబితా రూపొందించడం జరుగు తుందన్నారు. సెప్టెంబర్ 29 నుంచి నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించాలన్నారు. డిసెంబర్ 24లోగా అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలించి పరిష్కారం చేయాలన్నారు. 2025 జనవరి 6వ తేది నాటికి సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితా ప్రచురించాలన్నారు. ఎన్నికల కమీషన్ సూచించిన మార్గదర్శకాలు తూచ తప్పకుండా చేయాలన్నారు.తహశీల్దార్ శివరాముడు, ఎలక్షన్ డిప్యూటీ తాసిల్దార్ రామేశ్వర్ రెడ్డి, డీఎల్‌పీవో నూర్జహాన్ రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయవాడలో సీఎంకు చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : విజయవాడలోని వరద బాధితులకు అండగా ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియతో పాటు ఆళ్లగడ్డ తాలూకా ప్రజలు చేయూత అందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, శోభానాగిరెడ్డి ట్రస్టు తరపున రూ. 5 లక్షల విరాళం ప్రకటించిన విషయం విధితమే రూ. 5 లక్షల చెక్కుతో పాటు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పిలుపు మేరకు ఆళ్ళగడ్డ నియోజకవర్గంలోని 6 మండలాల టీడిపి నాయకులు అందించిన రూ.8.50లక్షలు, ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రకటించిన రూ.5 లక్షలు మొత్తం రూ.13.50లక్షల చెక్కును విజయవాడ కలెక్టరేట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఆయనకు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ, ఆళ్ళగడ్డ టీడీపి యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి అందించడం జరిగింది. వరదల్లో చిక్కుకుని తల్లడిల్లిపోతున్న ప్రజలకు మేమున్నాం అంటూ అండగా ఉండి ఆర్థిక సాయం అందించినందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియకి , యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు చవితి వేడుకలు

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : మాధవి నగర్ నందలి రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూల్ మరియు రెవిన్యూ కాలని నందలి రవీంద్ర టాలెంట్ స్కూల్‌లో ముందస్తు వినాయక చవితి వేడుకలు కరస్పాండెంట్ పి.బి.వి. సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మట్టి వినాయకుడు విగ్రహంలను విద్యార్థులు తయారుచేసి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పి.బి.వి.సుబ్బయ్య మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని.చవితి విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం చాలా అవసరం

విశాలాంధ్ర-కర్నూలు వైద్యం: విద్యార్థులకు పౌష్టికాహారం ఎంతైనాఅవసరం"విద్యార్థి దశలో పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని అప్పుడే వారు ఆటల్లోగాని, చదువుల్లో గాని రాణిస్తారని ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. అరుణ అన్నారు. శుక్రవారం పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ సత్యనారాయణ అధ్యక్షతన కర్నూలు మెడికల్ కాలేజీ కమ్యూనిటీ మెడిసిన్ మరియు ఎన్.ఎస్.ఎస్ విభాగము ఆధ్వర్యంలో జాతీయ పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య విద్యార్థులు పోస్టర్ రూపంలో పౌష్టికాహారం, హ్యాండ్ వాష్ టెక్నిక్ గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు.108 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్వహించారు.అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ప్రవీణ,ఆర్చెచ్.టి.సి పర్ల వైద్యాధికారులు సాయికీర్తి, లక్ష్మీశైలజ, లెక్చరర్ సురేష్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ షణ్ముఖుడు, సూపర్వైజర్ సాయిరామ్, భవానిసుభాషిని, వైద్యవిద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా.. మహిళా జైళ్లను సందర్శన

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి పంచలింగాలలోని జిల్లా జైలు-మహిళా జైలును సందర్శించారు. అక్కడున్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు.వారికి అందించే భోజన సదుపాయాలు స్వయంగా పరిశీలించి, పర్యవేక్షణ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. ఖైదీలతో మాట్లాడటానికి వచ్చే వారికి మాట్లాడే సదుపాయాన్ని పరిశీలించారు. ఉన్నతన్యాయ సేవ అధికార సంస్థ ఏర్పాటు చేసిన చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సెల్స్ ద్వారా అందిస్తున్న మెరుగైన ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.జైలు పర్యవేక్షణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కర్నూలులోని బాలల పరిశీలన గృహం, కర్నూలును తనిఖీ చేశారు. కార్యాలయం సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించి అక్కడ ఉన్న పిల్లలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసదస్సులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చట్టంతో వివేదించబడిన బాలలకు సంబంధించిన చట్టాలు, ఉచిత న్యాయ సహాయమును గురించి తెలియజేశారు. ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెండెంట్ ఎం. హుస్సేన్ బాష, డిపిఓ దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సొసైటీలో పేర్లు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-మిడుతూరు: మిడుతూరులోని పీరుసాహెబ్‌పేట సింగిల్‌విండో సొసైటీలో కంప్యూటరీకరణ ఆన్‌లైన్ జరుగుతుందని సొసైటీలో రైతుల పేర్లు నమోదు చేసుకోవాలని సింగిల్‌విండో సొసైటీసీఈవో మల్లికార్జున శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో ఓటు హక్కు కలిగిన రైతులు అందరూ తమ యొక్క ఆధార్‌కార్డు, పొలం పాస్‌బుక్కు, పాన్‌కార్డు జిరాక్స్, రెండు ఫోటోలు నామిని యొక్క ఆధార్ కార్డు జిరాక్స్ మిడుతూరులోనిసింగిల్ విండో సొసైటీకార్యాలయంలో ఈనెల26లోగా అందజేయాలన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలం

విశాలాంధ్ర-రుద్రవరం: పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీదేవి తెలిపారు.శుక్రవారం మండలంలోని చిన్నయ్య స్వామి చెంచుగూడెం లోని అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణి బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ ఫ్రైడే డ్రై డేను పాటించాలన్నారు. గర్భిణీ, బాలింతగృహ సందర్శనలో ఫ్యామిలీ ప్లానింగ్, బాల్య వివాహాలు గురించి తల్లులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఎత్తు, బరువు, రక్త పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం తల్లులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. సీజనల్ డిసీజెస్, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ అవగాహన కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త, ఆయా గర్భిణి బాలింతలు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

విశాలాంధ్ర-బనగానపల్లె: గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ కృష్ణయ్య పేర్కొన్నారు. పోలీసు స్టేషన్ ఆవరణంలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పీస్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని పలు సూచనలు ఇవ్వడం జరిగింది.

ఆరుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: కోవెలకుంట్లలో ఆరుగురు పేకాట రాయుళ్లు అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.25,560 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని బనగానపల్లె రోడ్డులో ఉండే టీటీడీ కళ్యాణం మండపం వద్ద ఉన్న కంప చెట్లల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి దాడి చేయగా 6 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండే 28,560 రూపాయను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

తహశీల్దార్‌ను కలిసిన టీడీపీ నాయకులు

విశాలాంధ్ర-నందవరం: మండల నూతన తహసీల్దార్ బాధ్యతలు చేపట్టిన కె. శ్రీనివాసులును నందవరం టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ ఖాసీం వలి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఎమ్మెల్యే డా.బి.వి. జయనాగేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు మీ ఉత్తమ సేవలను అందించాలని, రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలనీ, అందుకు టీడీపీ నాయకులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.ఆర్ఐ జార్మియ, పేట సామేలు, వెంకట్రాముడు, సూరి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలనే పూజించాలి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ మట్టితో తయారు చేసిన వినాయకులనే ప్రతిష్టించి పూజించాలని తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి అన్నారు. శుక్రవారం తమ కార్యాలయంలో మట్టితో తయారు చేసిన గణేష్ విగ్రహాలను రెవెన్యూ సిబ్బందికి పంపిణీ చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణం దెబ్బతింటున్నదని ఈ రసాయనిక రంగులను ఉపయోగించి చేసిన విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేసినప్పుడు చేపలు, జలచరాల మృత్యువాత పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో ప్రకృతి సిద్ధమైన బంక మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడం వల్ల పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖరయ్య, వీఆర్వో లు రాజగోపాల్ రెడ్డి, గోవిందరెడ్డి, తులసిలు పాల్గొన్నారు.



వినాయక చవితి కి ముస్తాబైన గణేష్ మండపాలు

విశాలాంధ్ర-వెలుగోడు : వెలుగోడు పట్టణంలో వినాయక చవితి పండుగకు గణేష్ మండపాలు సిద్ధం చేశారు. వెలుగోడు మండలంలో ఈ ఏడాది సుమారు 40 విగ్రహాలకు పైగా ప్రతిష్ట చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వినాయక చవితి పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై విష్ణు నారాయణ తెలిపారు.

గ్రామాలకు చేరుకుంటున్న గణనాథులు

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఒక్క రోజు ముందుగానే శుక్రవారం గణనాథులు గ్రామాలకు చేరుకుంటున్నారు. పట్టణ ప్రాంతాలకు తరలివెల్లి యువకులు గణనాథులను ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా ఆయా గ్రామాలకు తీసుకుని వస్తున్నారు. శనివారం ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో గణనాథులను కొలువులో ఉంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం రోజు నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

విశాలాంధ్ర-ప్యాపిలి: పట్టణంలో శుక్రవారం ఏకలవ్య సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు, జామ, తులసి మొక్కలు డా.ఎల్లప్ప, ఏపీ వైఎస్ఎస్ మహిళా కమిటీ అధ్యక్షురాలు మనోరమ పంపిణీ చేశారు. అనంతరం ఏకలవ్య విగ్రహానికి పూల మాలలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడాలని వారన్నారు. ఏకలవ్య సేవా సమితి ఆధ్వర్యంలో మంచి సేవలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని వారన్నారు. ఏకలవ్య సేవా సమితి సభ్యులు శేఖర్,శేషాద్రి, శ్రీనివాసులు, మహేంద్ర, బాలకృష్ణ, ఏరుకుల హక్కుల పోరాట సేవా సంఘం అధ్యక్షులు, గోపాల్, శ్రీనివాసులు, సురేంద్ర. సునీల్, సుంకన్న, నారాయన, వెంకటేశు, కిట్టు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూజా సామాగ్రి కేంద్రాల వద్ద సందడే సందడి

విశాలాంధ్ర-అవుకు: వినాయక చవితి పర్వదినం సందర్భంగా పూజా సామాగ్రి కొనుగోలు కేంద్రాల వద్ద సందడి నెలకొంది. పట్టణంలో సెంటర్, బస్టాండ్ వద్ద వినాయక విగ్రహ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ విక్రయ కేంద్రాల వద్ద పూజా సామాగ్రిలైన వినాయక ప్రతిమ, మామిడాకులు, అరిటాకులు, గణపతికి ఇష్టమైన గరక, ఉత్తరేనాకు, వెలగపండు, పూలు కొనుగోలు చేసేందుకు ప్రజలు పెద్ద ఎత్తున కేంద్రాల వద్దకు చేరుకుని పూజా సామాగ్రిని కొనుగోలు చేస్తున్నారు.

గ్రామ సమాచారాన్ని తెలియజేయండి

విశాలాంధ్ర-కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలో తాసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలకు, గ్రామ సేవకులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఐదు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని ఈ వర్షాలకు గ్రామం లోని మట్టి మిద్దెలు బాగా నాని కూలిపడే అవకాశం ఉందన్నారు. కావున వీఆర్ఏలు, వీఆర్వోలు అప్రమత్తంగా ఉండి గ్రామంలో జరిగిన పరిస్థితులను గమనించి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలన్నారు. అంతేకాకుండా వర్షాలకు పంటలు ఏమైనా దెబ్బతిని ఉంటే మా దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. గ్రామాలలో గ్రామ సేవకులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు మాకు సమాచారం అందజేయాలని తాసిల్దార్ అన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాల మద్దిలేటి, బాల చెన్నయ్య, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారుల సమీక్షించిన డీఈవో

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్: కర్నూలు జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారుల సమీక్ష సమావేశం జిల్లా పరిషత్ సమీవేశ మందిరంలో డీఈవో కే.సామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా అడిషనల్ డైరెక్టర్ నరసింహారావు హాజరై వారు మాట్లాడుతూ మండల విద్యాధికారులకు ఎంఐఎస్లకు స్కూల్ డిఐఎస్సి వివరాలను ఆన్లైన్లో నింపే విధానాన్ని తెలియజేశారు . మండల విద్యాధికారులు చేయవలసిన విజిటింగ్ లు ఇన్స్పెక్షన్ కచ్చితంగా సంవత్సరంలో ఉన్న అన్ని స్కూళ్లలో తప్పనిసరిగా చేయవలెను టీచర్లు సరైన సమయంలో వేయవలెనని పిల్లల వివరాలను స్కూల్ వివరాలను సరైన విధంగా యాప్లో నింపవలెనని మండల విద్యాశాఖ అధికారులకు ఆయన సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి, పర్యవేక్షకులు పాల్, ఏ సోలు మరియు ఆఫీసర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-కర్నూలు ఎడ్యుకేషన్ : సరైన లక్ష్యం ఏర్పరచుకొని ఉజ్వల భవిష్యత్తుగా ప్రయాణించాలని రాయలసీమ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఎన్.టి.కే.నాయక్ ఉద్బోధించారు. యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మరియు లిటరల్ ఎంట్రీ విధానాల్లో రెండో సంవత్సరంలో చేరిన విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. నాలుగేళ్ల కలాని సద్వినియోగం చేసుకుంటూ యూనివర్సిటీలో ప్రస్తుతం సక్రమంగా విద్యార్థులంతా ఉన్నంత స్థానాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు.

వ్యాపార రంగం అభివృద్ధి జరగాలి

విశాలాంధ్ర-బనగానపల్లె : దిన దినాన వ్యాపార రంగం మరింత అభివృద్ధి జరగాలని బనగానపల్లె పట్టణం వ్యాపారానికి కేంద్ర గా ఉండడంతోనే పెట్టుబడిదారులు ముందుకు రావడం జరుగుతుందని కర్నూలు ఉమ్మడి జిల్లాల టెలికం మాజీ అడ్వైజర్ మెంబర్, పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి బీసీ ఇందిరమ్మ పేర్కొన్నారు. బనగానపల్లె పట్టణంలోని నంద్యాల రోడ్డు నందు టంగుటూరు గ్రామానికి చెందిన మురళి సప్తగిరి ఎంటర్ప్రైజెస్ ప్రారంభోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, బీసీ బిసి ఇందిరమ్మ హాజరై ప్రారంభించారు. ముందుగా బీసీ రాజారెడ్డి బీసీ ఇందిరమ్మ అక్కడికి చేరుకోగానే పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సప్తగిరి ఎంటర్ప్రైజెస్ నూతన వ్యాపారాన్ని బీసీ రాజారెడ్డి, బీసీ ఇందిరమ్మ చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణం ప్రశాంతంగా ఉండడంతో వ్యాపారానికి అనువైన ప్రాంతం గా భావించి పెట్టుబడిదారులు ముందుకు రావడం జరుగుతుందన్నారు. పాలకులు మంచివారైనప్పుడు వారిపై నమ్మకంతో పెట్టుబడిదారీలు ముందుకొస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణయ్య, ఉప సర్పంచ్ బండి మౌలిశ్వర్ రెడ్డి, జంపని శేషారెడ్డి, రామ్ శేఖర్, ధనుంజయ రెడ్డి, పుల్లారెడ్డి, అత్తర్ కలం, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి

విశాలాంధ్ర-చాగలమర్రి : వినాయక చవితి పండగను నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో ముగించాలని ఇన్‌చార్జ్ ఎస్ఐ హరిప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలం లోని సున్నితమైన గ్రామాలైన గొడెగనూరు, తోడేండ్లపల్లె, చిన్నవంగలి గ్రామాలో గ్రామ పెద్దలు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకచవితిని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. గ్రామాలలో ఏవైన మనస్పర్థలు,సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. అంతేగాని పండుగకు ఆటంకం కలిగించ రాదన్నారు. ఉత్సవాల సమయంలో గొడవలు, అల్లర్లు జరిగితే కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఉత్సవాల సమయంలో మద్యం సేవించకుండా భక్తి,శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని సూచించారు.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి

విశాలాంధ్ర-ఆళ్లగడ్డ: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా ముందుకు రావాలని మర్రిపల్లె గ్రామానికి చెందిన అబ్దుల్ గఫార్ శుక్రవారం ఆటో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులు త్వరగా కోలుకోవాలని.. వారికోసం ప్రార్థనలు చేయాలని కోరుతూ ఆటో యాత్ర చేస్తున్నామన్నారు. వరదల్లో మృతి చెందిన కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వమే కాకుండా, పలు సేవా సంస్థలు, ప్రజలు వరద బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు.

వ్యాధుల పట్ల జాగ్రత్త వహించండి

విశాలాంధ్ర-వెలుగోడు : వెలుగోడు మండలంలోని రెగడగూడూరు 1 , 2 సచివాలయాలను వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ పి.జహీర్ వలి శుక్రవారం విజిట్ చేయడం జరిగింది. డ్రై డ్రె లో భాగంగా గ్రామంలో ప్రజలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించడం జరిగింది. స్కూల్ విజిట్ చేసి పిల్లలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఈ ప్రోగ్రాం లో పరిశుభ్రత గురించి వివరించారు. పంచాయతీ సెక్రెటరీలు శానిటేషన్ భాగంగా గ్రామంలో బ్లీచింగ్ పౌడర్ చెల్లించారు. ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు ఎం.ఎల్. హెచ్ పి లు ఆశ కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

కళ్ల పట్ల నిర్లక్ష్యం తగదు

విశాలాంధ్ర-ఉయ్యాలవాడ: కంటి పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే కంటి చూపు పోయే ప్రమాదం ఉందని వైద్యాధికారిని అపర్ణ అన్నారు. 39వ జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్య నిపుణులు రమేష్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంతో పాటు నేత్రదానం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ దస్తగిరి, హెల్త్ సూపర్వైజర్ రామ చంద్రుడు, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తపాల కార్యాలయ దొంగ అరెస్టు

విశాలాంధ్ర-బనగానపల్లె: తపాల కార్యాలయంలో దొంగతనం చేసేందుకు విఫల ప్రయత్నం చేసిన నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు.పోలీస్ స్టేషన్లో మీడియా సమావేశంలో సీఐ కృష్ణయ్య మాట్లాడుతూ గత నెల 5న పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వాకిలి తాళాలు పగలగొట్టి పోస్ట్ ఆఫీస్ లోకి ప్రవేశించిన వ్యక్తి లాకర్లోని డబ్బులు తీయలేక వెనక్కి వెళ్లినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టామని శుక్రవారం నాడు జీఎం టాకీస్ వద్ద అనుమాన స్పదగా తిరుగుతున్న వ్యక్తిని అరెస్టు చేసి విచారణ చేయగా అతడు గౌండా పని చేసే సయ్యద్ ముస్తఫా అలీ గా గుర్తించినట్లు అతడే బాకీలు ఉన్న దృశ్య దొంగతనానికి పాల్పడినట్లు తెలిపారు. అతనిపై ఇదివరకే దొంగతనం కేసు ఉన్నట్లు తెలిపారు.

గణేష్ పండుగకు ముమ్మర ఏర్పాట్లు

విశాలాంధ్ర-హొళగుంద: మండలంలో శనివారం నుండి గణేష్ పండుగ జరుపుకోవడానికి గణేష్ మిత్రమండలి వారు ముమ్మర ఏర్పాట్లు చేసున్నారు. గణేష్ విగ్రహాలను కూర్చోబెట్టడానికి పోలీస్ అనుమతిని గణేష్ మిత్రమండలి వారు దరఖాస్తు చేసుకున్నారు. గణేష్ మండపాలు, విద్యుత్, త్రాగునీరు, బ్యారీ క్యాడ్ల ఏర్పాటు పూజ కార్య క్రమాల కోసం అన్ని వసతులు భక్తులకు కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని మంటపాల నిర్వాహకులు నీలకంటయ్య స్వామి, సబ్జా సుబ్బారావు, తెలిపారు. శ్రీరామ్నగర్లోని శ్రీరామ ఆలయం ఆవరణంలో 15వేల రూపాయలు ఖర్చుపెట్టి వరి సిద్ది వినాయకగణేష్ విగ్రహాన్ని కూర్చో పెడుతున్నారు. గణేష్ మిత్రమండలి భారీ విగ్రహాలను ఖరీదు చేసి ఆయా బండపాల్లో కూర్చోబెడుతున్నారు.పోలీసు బందోబస్తు ఎస్సై బాల నరసింహులు తెలిపారు.